క్లుప్తంగా

ఫిట్‌నెస్‌లేని బస్సులు నడిపితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

కోవెలకుంట్ల: ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే చర్యలు తప్పవని ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పట్టణానికి చెందిన వివిధ ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల నుంచి పాఠశాలలకు విద్యార్థులను తీసుకొచ్చే స్కూల్‌బస్‌లు రోడ్డు రవాణాశాఖ నిబంధనలకు అనుగుణంగా కండిషన్‌తో ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పుస్తకాలు, యూనిఫాం, ఫీజుల రూపంలో అధిక మొత్తం వసూలు చేసినట్లు ఫిర్యాదు అందితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ జ్యోతి

కొలిమిగుండ్ల: రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే ఎంత మోతాదులో ఎరువులు వేయాలనే విషయాలు తెలుస్తాయని వ్యవసాయాధికారిణి జ్యోతి తెలిపారు. శుక్రవారం నందిపాడు, బి.ఉప్పలూరు గ్రామాల్లో ఆమె పర్యటించి భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈఏడాది మండలంలో 542 మట్టి పరీక్షలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మట్టి పరీక్షలకు సంబంధించి మట్టిని ఎలా తీయాలి, ఎంత పరిమాణంలో తీయాలనే విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జయదీప్, స్నేహలత, సునియ బేగం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి సూచించారు. మేజర్ గ్రామ పంచాయతీ అవుకు పరిధిలోని మార్కెట్ వీధిలో ఈఓ అశ్విన్, డాక్టర్ నవీన్‌తో కలిసి ఎంపీడీఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీధుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వాతావరణ మార్పు వలన సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి వీధిని శుభ్రం చేయడమేకాకుండా బ్లీచింగ్ చల్లే కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓ సోమశేఖర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణ వేణమ్మ, శ్రీదేవి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్ : జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐల్లో 2024–25 విద్యా సంవత్సరంలో రెండవ విడుత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్స్‌పాల్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేది నుంచి జూలై 24వ తేదీ వరకు iti.ap.gov.in అనే వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఓరిజినల్ సర్టిఫికెట్స్‌తో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మెరిట్ ర్యాంక్ ఆధారంగా ప్రభుత్వ ఐటీఐల్లో జూలై 27,28 తేదీల్లో, ప్రైవేట్ ఐటీఐల్లో జూలై 29,30 తేదీల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్‌లకు హాజరుకావాలని ఆయన సూచించారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 312 మంది విద్యార్థులు ఎంపిక

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన కాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 312 మంది విద్యార్థులు ఎంపికయినట్లు ప్రిన్స్‌పాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐలలో చదువుతున్న 450 మంది హాజరు కాగా 312 మందిని వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సీఐ బదిలీ తప్పదా?

- కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ సీఐగా వచ్చేందుకు పెరిగిన పోటీ



కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్

కొలిమిగుండ్ల: స్థానిక సీఐ గోపీనాథ్‌రెడ్డి బదిలీ తప్పదనే గుసగుసలు వెల్లువెత్తుతున్నాయి. జూలై మొదటి వారంలోగా పోలీసుల బదిలీలు జరుగుతాయనే ప్రచారం నేపథ్యంలో ఇక్కడికి సీఐగా వచ్చేందుకు భారీగా పోటీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొలిమిగుండ్ల మండలంలో ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై విమర్శలు బాగానే వచ్చాయి. అయితే ఊహించని విధంగా టీడీపీ అధికారం చేపట్టింది. బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలిచిన బీసీ జనార్దన్‌రెడ్డిని ఏకంగా మంత్రి పదవి వరించింది. ఇప్పుడు సీఐ బదిలీ అంశం తెరపైకి వచ్చింది. దీంతో ఆశావహులు ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆశీస్సుల కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌కు ఎప్పుడు పోటీ ఉంటూనే ఉంది. జిల్లాకు సరిహద్దులో స్టేషన్ ఉండడం, సిమెంట్ ఫ్యాక్టరీలు, నాపరాతి గనులు అధికంగా ఉన్న నేపథ్యంలో స్టేషన్‌కు కూడా ఆదాయం బాగానే ఉంటుందని ఇక్కడకు వచ్చేందుకు పోలీసులు పోటీ పడుతూనే ఉంటారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాంతి భద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్ల, బనగానపల్లె, ఆత్మకూరు, శ్రీశైలం టూటౌన్ పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసింది. ఈకోవలోనే కొలిమిగుండ్ల పీఎస్ అప్‌గ్రేడ్ కావడంతో ఫిబ్రవరిలో సీఐ పోస్టు మంజూరైంది. ఆ సమయంలోనూ ఇక్కడ పోస్టింగ్ కోసం పలువురు పోటీ పడ్డారు. చివరకు గోపీనాథ్‌రెడ్డి ఫిబ్రవరి 22న సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టీడీపీ నాయకులు తమ మార్క్ చూపించునేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఐ గోపీనాథ్‌రెడ్డికి బదిలీ తప్పదని తెలుస్తుంది. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వెంకటేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, మంజునాథతో పాటు పలువురు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే వెంకట్రామిరెడ్డికి పోస్టింగ్ దక్కుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ అయ్యాక సీఐ స్థాయి అధికారి మాత్రమే ఉన్నారు. ఎస్‌ఐ పోస్టు మంజూరు చేస్తారా లేదా తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా కొలిమిండ్ల పోలీస్ స్టేషన్ సీఐ పోస్టుకు పోటీ పెరిగింది.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా నిధుల మళ్లింపునకు ఆమోదం

- మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాకీర్‌హుసేన్



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్

డోన్ : డోన్ మున్సిపాలిటీలోని ఆటో నగర్‌కు కేటాయించిన రూ.98లక్షలు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మంజూరయ్యాయని మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, నాయకులు మిట్టా రవి, కాలేషా, వంశి, పాలుట్ల రఘురాం తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరిగిన మున్సిపల్ సమావేశానికి మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరై ఆటోనగర్ అభివృద్ధికి రూ.98 లక్షలు కేటాయించాల్సిందిగా పాలకవర్గాన్ని కోరారన్నారు. పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అందరూ మూకుమ్మడిగా ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పట్టణాభివృద్ధికి రాజకీయ విబేధాలకు తావులేకుండా ఎమ్మెల్యే కోట్ల ముందుకు సాగుతారని విశ్వసిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యుల కోరిక మేరకు స్పెషల్ గ్రాంట్ కింద రూ.6కోట్లు, గడపగడపకు మన ప్రభుత్వం పథకం కింద సచివాలయానికి రూ.10లక్షల చొప్పున మాజీ మంత్రి బుగ్గన మంజూరు చేయించిన విషయాన్ని వారు గుర్తుకు చేశారు. అయితే మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ తాను మంజూరు చేయించినట్లు పత్రికా ప్రకటనలు ఇవ్వడం సమంజసంగా లేదన్నారు. ఏ పద్దు కింద నిధులు మంజూరు చేయించారో కోట్రికె హరికిషన్ పట్టణ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

అస్తవ్యస్తంగా కూరగాయాల మార్కెట్ !



డోన్ మార్కెట్‌లో అక్రమంగా నిర్మించిన కట్టడం

- మితిమీరిన టీడీపీ నాయకుల జోక్యం
- రహదారులను ఆక్రమించిన కొందరు పెద్ద వ్యాపారులు
- ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు

డోన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.16కోట్లతో పాతబస్టాండ్ పక్కన అత్యంత ఆధునిక వసతులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ నిర్వహణ నేడు అధికార పార్టీ నాయకుల జోక్యం మూలంగా అస్తవ్యస్థంగా మారింది. వ్యాపారులందరికీ ఉపాధి చూపించాలనే లక్ష్యంతో చిన్నచిన్న కట్టలు ఏర్పాటు చేయించి అందరికి అనుకూలంగా పాలకవర్గం కేటాయించింది. అయితే గత ఎన్నికల్లో అధికారంలోకి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మార్కెట్‌లోని కొందరు బడా వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నారు. మార్కెట్‌లోని కొందరు వ్యాపారులతో కుమ్మక్కై అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మార్కెట్ ఇరుకుగా మారి రాకపోకలకు పూర్తి ఇబ్బందిగా మారింది. కొందరు వ్యాపారులు దారిస్థలాన్ని సైతం ఆక్రమించి కూరగాయల గంపలు, ట్రేలను ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్ నిర్వహణ అంతా మాదే అన్నట్లుగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న అస్థవ్యస్థ పరిస్థితులపై వెంటనే మున్సిపల్ పాలకవర్గం, పోలీసులు జోక్యం చేసుకొని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా ట్రేలు ఉంచిన వ్యాపారులు



రహదారి వెంట ఏర్పాటుచేసిన స్టాళ్లు

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రమణయ్య

బనగానపల్లె రూరల్ : గ్రామీణ మహిళాలు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టిసారించాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త రమణయ్య సూచించారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో బీఏఐఎఫ్ టాటా పవర్ ప్రాజెక్టు, కేవీకేల సంయుక్త ఆధ్వర్యంలో పొదుపు మహిళాలకు చిరు ధాన్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఈ నెల 26 నుంచి ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలతో స్వీట్స్ స్నాక్స్, మధ్యాహ్న భోజన ప్రదార్థాలను ఆకు కూరలను ఉపయోగించి తయారుచేయవచ్చాన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార ప్రదార్థాలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు లక్ష్మీప్రియ రవిగౌడ్‌లు చిరుధాన్యాల ప్రాధాన్యతలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే ఏఓ సురేష్‌కుమార్, బీఏఐఎఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, అవుకు మండలంలోని గొగులదిన్నె, వేములపాడు గ్రామాల పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఈద్గా నగర్‌లో పర్యటించిన మంత్రి బీసీ

బనగానపల్లె : పట్టణంలోని ఈద్గా నగర్‌లో శుక్రవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. మురుగు కాల్వలను పరిశీలించిన మంత్రి వెంటనే పూడిక తొలగింపు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మురుగు కాల్వను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

మంత్రిని కలిసిన కేఎస్ పల్లె నాయకులు

అవుకు: అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులతో కలిసి రాయలసీమ ఉద్యమ నాయకుడు రాథోడ్ సీమకృష్ణ శుక్రవారం బనగానపల్లె పట్టణంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని వారు మంత్రిని కోరారు. కార్యక్రమంలో టీడీసీ నాయకులు సుబ్బయ్య, శ్రీరాములు నాయక్, కోనేటి చిన్న బాలసుంకన్న, నారాయణ స్వామి, హరి, వెంకటన్న, రమేష్, నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్యాపిలి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్ తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలతో పాటు శివసాయి పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాని సూచించారు.

మూడో విడత పాఠ్యపుస్తకాలు మంజూరు

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలలకు 1నుంచి 10వ తరగతి వరకు మూడవ విడత 7,091 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మొదటి విడతలో 35,936, రెండవ విడతలో 19,316 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. పుస్తకాలను ఆయా పాఠశాలలకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ వెల్లడించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ఎస్‌ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు తదితర ప్రాంతాల వైపు వెళ్తున్న వాహనాలాపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి బైక్ నడపాలని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి టీవీ విరాళం



టీవీ అందజేస్తున్న ఆంజనేయులు

డోన్ : స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి శుక్రవారం అనీల్ మెడికల్ షాప్ యాజమాని ఆంజనేయులు రూ.15వేల విలువ టీవీని విరాళంగా అందజేశారు. వృద్ధుల సౌకర్యార్థం టీవీ అందజేసిన దాతకు ఆశ్రమ నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులకు విద్యార్థినుల అప్పగింత

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని రుద్రాక్ష గుట్టలో ఉన్న కస్తూర్బాకు చెందిన ఇద్దరు ఐదవ తరగతి బాలికలు శుక్రవారం పాఠశాల నుంచి పారిపోయారు. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ వసుంధరదేవి పోలీసులు, బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు కర్నూలు పట్టణంలో బాలికలు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాలికలను తల్లిదండ్రులకు అప్పజెప్పినట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. అయితే సిబ్బంది విద్యార్థినులపై నిర్లక్ష్యంగా వ్యహరించినందునే ఈ సంఘటనలు చోటు చేసుకుందని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా స్కూల్ నుంచి వెళ్లిపోవాలని ప్రిన్సిపాల్ ఆదేశించడం సమంజసం కాదన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

డోన్ రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రి సానిటేషన్ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి సానిటేషన్ వర్కర్లను శుక్రవారం ఆయన కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన బాలన్న అనే వ్యక్తి పక్షవాతం గురవడంతో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో వసుధ పౌండేషన్ సహకారంతో రూ.10 వేలు అందజేశారు. శీనయ్య కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దిన్, బండికుమార్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బాధిత కుటుంబం సభ్యులకు అందజేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన పూల నబీ రసూల్ (48) నంద్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పూల నబీ రసూల్ ఈ నెల 22వతేదీన ఆకుమల్ల లైన్‌మెన్ ఉస్సేన్‌తో కలిసి ఓ రైతు పొలంలో విద్యుత్ తీగెలు సరిచేయడానికి వెళ్లాడు. విద్యుత్ స్తంబం ఎక్కి తీగెలు సరిచేస్తుండగా ప్రమావత్తుశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ డీపీపై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో నంద్యాలలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి ఇద్దరు సంతానం.

ఆధ్యాత్మికం

వైభవంగా తిరుచ్చి మహోత్సవం



మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

బేతంచెర్ల: ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ట మాసం శుక్రవారం రాత్రి స్వామివారి తిరుచ్చి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు వేదపండితులు, అర్చకులు మనోహర్, నరసింహ, మద్దిలేటిస్వామి తదితరులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో స్వామి,అమ్మవార్లను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో వెలసిన కనక దుర్గమ్మకు శుక్రవారం మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సాయంత్రం అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకుతీర్థప్రసాదాలు అందజేశారు.

పద్మావతికి పూజలు

డోన్ టౌన్ : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోష్ఠి సభ్యులు, మహిళా భక్తులు పద్మావతి అమ్మవారికి అభిషేకాలు,అర్చనలు చేశారు. దీపోత్సవ కైంకర్యం కనుల పండుగగా జరిగింది.

ముగిసిన ప్రవచనాలు

డోన్: స్థానిక శ్రీరాముల దేవాలయంలో ఏడు రోజులుగా జరుగుతున్న రామయణ సుందరాకాండ ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు సుధాకర్ శర్మ భాస్కర్, భగవాన్, రాముల ఆధ్వర్యంలో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ ఆధ్వర్యంలో భక్తులు లోకకళ్యాణార్థం హోమాలు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బేతంచెర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట రమణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 1, 3 అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనతరం పట్టణంలోని సంజీవనగర్, శ్రీనగర్ కాలనీలను సందర్శించారు. డెంగీ కేసులను పరిశీలించారు. తొట్లలోని నీటిని పారబోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారానికోసారి రెండుగంటలు నీటి తొట్లను ఆరబెట్టాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు ప్రియాంక, తస్లీమా పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట రమణ

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.40 లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు పూర్తి అయ్యాయి. గతంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా జనాభాకు తగ్గట్టుగా నీటి సరఫరా అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. మంచినీటికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో అదనంగా మరో ఓవర్‌హెడ్ ట్యాంక్ మంజూరు చేయించారు. ట్యాంక్ పనులు పూర్తి కావడంతో త్వరలోనే బోరు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.



అంకిరెడ్డి పల్లెలో నిర్మించిన ట్యాంక్